సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 7 । జూన్ । 2024



వేలికొసన సమాచారం..

రైతులకు సమస్త సమాచారం యాప్‌లలో అందుబాటులో ఉంది. అన్ని సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. - 8లో



దాబాలో గొడవ..

కొర్లాం సమీపంలోని ఓ దాబాలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు నమోదు చేశారు. - 8లో



అందరి సహకారంతో..

ఎన్నికలు విజయవంతం కావడంతో సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. పనితీరును ప్రశంసించారు. - 8లో

అరేకా.. వచ్చింది మన దాకా..



ముసగ చెట్టుతో కలిసి పెరుగుతున్న అరేకా కాటేజ చెట్టు



ఈ గెల వాడకానికి ఒక వ్యక్తికి కొన్ని నెలలు సరిపోతుంది

- ఉద్యానవన పంటల్లో అరేకా పాన్ మొక్కలు
- కిల్లీ, పాన్ మసాలా, తాంబూలాలకు డిమాండ్
- ప్రయోగాత్మకంగా పండిస్తున్న మాజీ సైనికుడు

కాశీబుగ్గ:

అరేకా కాటేజ్.. ఈ మొక్క పేరెప్పుడైనా విన్నారా..? శీతల ప్రాంతాల్లో పండే ఈ చిన్నతాటి చెట్టు తరహా పంటను ఇప్పుడు ఉద్దానానికి ఓ మాజీ సైనికుడు పరిచయం చేస్తున్నాడు. సుమారు 30 నుంచి 45 అడుగుల పొడవు పెరిగే మొక్కలు ఏడాదికి మూడు సార్లు పంటకాసి ఫలసాయం అందిస్తాయి. గుత్తులు మాత్రం చూపునకు పామాయిల్‌ను పోలి ఉంటాయి. ఒక్క గెలలో వందల సంఖ్యలో గింజలు ఉంటాయి. ఇలా ఒక చెట్టుకు పదుల సంఖ్యలో గెలలు కాస్తాయి. అరేకా గెలలు పండిన రంగులోకి వచ్చిన అనంతరం అవసరమైతే కోస్తారు. అవి కొయ్యకున్నా పండిన అనంతరం వాటంతటవే కిందపడిపోతాయి. పండిన వాటిని ఎండలో ఆరబెట్టి అనంతరం కొబ్బరికాయలా పీచును తొలగించి లోపల గోలీ పిక్క వంటి సైజులో ఉన్న చెక్క కాయలను సేకరిస్తారు.

ఆగస్టు–సెప్టెంబరులో ఒక వంతు, అక్టోబరు–నవంబరు రెండో వంతు, డిసెంబరు–జనవరితో మూడోవంతు ఇవి ఫలసాయాన్ని అందిస్తాయి. అధికంగా శీతల ప్రాంతాల్లో ఈ పండే పంటలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. దక్షిణ ఆసియా, ఆగ్నేయాసియా, తూర్పు ఆఫ్రికా, పసిఫిక్ ప్రాంతం, ఇండియాలో పశ్చిమబెంగాల్, అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ పంట ఎక్కువగా కనిపిస్తుంది. క్రమేపీ అనేక ప్రాంతాలకు చెక్క దిగుమతి అయ్యి ఇప్పుడు ఏకంగా పంటే పండిస్తున్నారు. ప్రస్తుతం కేరళ, కర్ణాటక, తూగో జిల్లాల వరకు వచ్చేశాయి. ఇప్పుడు ఏకంగా మన ఉద్దాన ప్రాంతానికి పరిచయం అయ్యాయి.



ఎందుకింత డిమాండ్..?

అరేకా చెక్క చరిత్ర ఒక్కసారి చూస్తే శతాబ్దాల కాలం నుంచి మన పూర్వీకులు వివిధ రూపాలుగా వాడుతున్నారు. కిల్లీల రూపంలో, తాంబూలాల రూపంలో, ఆకు వక్కల రూపంలో ఎప్పటి నుంచో ఈ చెక్కలను మనం వాడుతున్నాం. పాన్ మసాలా కంపెనీలు కూడా దశాబ్దాలుగా వీటిని వినియోగిస్తున్నాయి. అందుకే ఈ పంటకు ఇంత డిమాండ్. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌లో ఈ పంటపై కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది.

ప్రయోగాత్మకంగా ఉద్దానంలో..

శీతల ప్రాంతాన్ని పోలిన వాతావరణం మన ఉద్దానంలో ఉంది. ఇక్కడ సముద్రతీర గాలులు, తూర్పు గాలులు కావడంతో మాకన్నపల్లి గ్రామంలో ప్రయోగంగా వేసిన పంట.. ఫలసాయాన్ని అందించింది. అండమాన్ నికోబార్ దీవుల నుంచి కుత్తుం వినోద్ కుమార్ అనే మాజీ సైనికుడు విత్తనాలను తీసుకుని వచ్చి ఇంటి చుట్టూ నాటారు. ఆయనే కాకుండా పశ్చిమబెంగాల్, అండమాన్ వివిధ రకాలైన దీవుల్లో వివిధ రకాల కంపెనీలు, ఉద్యోగాలు చేసినవారితో పాటు చాలా మందికి చెక్క తినడం అలవాటు కావడంతో వారంతా వాటిని దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం ఉద్యోగాలు వదిలి ఉద్దానం రావడంతో ఏకంగా విత్తనాలను తెచ్చుకుని చెట్లును నాటుతున్నారు. మాకన్నపల్లి గ్రామంతో పాటు మందస, పలాస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో అక్కడక్కడా కనిపిస్తున్నాయి.

ఉచితంగా విత్తనాలు..



నేను ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్నప్పుడు అండమాన్ నికోబార్ దీవుల్లో పర్యటించాను. అప్పుడే అక్కడ చెక్క గురించి విని వాటి విత్తనాలను సేకరించి తీసుకుని వచ్చాను. ఐదేళ్ల కిందట నాటగా ఇప్పుడు మా ఇంటి చుట్టుపక్కల వాతావరణంలో అనేక మొక్కలు పెరిగి పంటను అందిస్తున్నాయి. ఈ చెక్క అన్నింటికీ ఉపయోగిస్తున్నారు. ఎవ్వరికైనా విత్తనాలు అవసరం అనుకుంటే నన్ను సంప్రదిస్తే నేను ఉచితంగా అందిస్తాను.

– కుత్తు వినోద్ కుమార్, మాజీ సైనికుడు, రైతు

న్యూస్‌రీల్

డిప్యుటేషన్ రద్దుకు నిరాకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ అధికారిగా పని చేస్తున్న అంజిత్ కుమార్ డిప్యుటేషన్ రద్దుకు దరఖాస్తు చేసుకోగా నిరాకరించారు. ఈ నెల 9వ తేదీతో ఆయన డిప్యుటేషన్ ముగుస్తుంది. దీంతో ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం డిప్యుటేషన్లు రద్దు చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతో డిప్యుటేషన్లు రద్దు చేయడం లేదని, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించనున్నామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీలా సుజాత తెలిపారు.

మలేరియా నివారణకు చర్యలు



మలేరియా నివారణ మందును స్ప్రే చేయిస్తున్న వైద్య సిబ్బంది

నరసన్నపేట: మలేరియా వ్యాధి నివారణకు ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస గ్రామంతో పాటు, సమీపంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దోమల నివారణకు ఏసీఎమ్ మందు స్ప్రే చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎం.సంతోష్‌కుమార్, సీహెచ్‌ఓ డి.మోహనరావు, సబ్‌యూనిట్ అధికారి ఎం.ఆచారి, ఎంఎల్‌హెచ్‌పీ రుక్మిణి, ఏఎన్‌ఎం ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీడాప్ చైర్మన్ పదవికి రాజీనామా



సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి

ఇచ్ఛాపురం: సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) కార్పొరేషన్ చైర్మన్‌గా 2021లో తాను బాధ్యతలు స్వీకరించానని, అప్పటి నుంచి ఎంతో మంది యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు అందిస్తూ వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేశానని సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. అంతే కాకుండా కొంతమంది అభాగ్యులకు ఆరోగ్యశ్రీ సేవలు, సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం, ప్రజావసరాలు, ప్రజాసమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశానన్నారు. ఇటీవల వెలువడిన సార్వత్రిక ఫలితాల్లో ప్రజా తీర్పుని గౌరవిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గవర్నమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వెలగపూడి వారికి తన రాజీనామా పత్రాన్ని పంపించినట్లు తెలియజేశారు. ఇలాంటి గొప్ప అవకాశం కల్పించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ పెద్దలకు, జిల్లా పెద్దలకు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు 2307 మంది హాజరు



సహాయ కేంద్రంలో సర్టిఫికెట్ పరిశీలన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన పాలీసెట్–2024 కౌన్సెలింగ్‌కు మొదటి ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు విద్యార్థులు 2307 మంది హాజరయ్యారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రంలో 108001 నుంచి చివరి ర్యాంకు వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన గురువారం నిర్వహించగా, 256 మంది హాజరయ్యారు. వీరిలో ఓసీ, బీసీలు 181, ఎస్సీ, ఎస్టీలు 75 మంది ఉన్నారు. ర్యాంకు వచ్చి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కాని విద్యార్థులు 10వ తేదీ వరకు హాజరు కావచ్చు. కళాశాలలు, బ్రాంచ్‌ల ఆప్షన్ల నమోదు శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు, ఆప్షన్ల మార్పు 11వ తేదీ, సీట్ల అలాట్‌మెంట్ ప్రకటన ఈ నెల 13వ తేదీన, కళాశాలల రిపోర్టింగ్ ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, క్లాస్‌వర్క్ ప్రారంభం ఈ నెల 14 నుంచి నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీ కృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

సమర్థంగా బందోబస్తు నిర్వహణ : ఎస్పీ



ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న జిల్లా పోలీసు సిబ్బంది సమర్థంగా బందోబస్తు నిర్వహించారని ఎస్పీ జీఆర్ రాధిక కొనియాడారు. ఈ మేరకు గురువారం ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. బందోబస్తు విధుల్లో పాల్గొన్న హోంగార్డు నుంచి డీఎస్పీ స్థాయి అధికారులు, అదనపు ఎస్పీలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డి.గంగాధరం (సెబ్), ఇతర కేంద్ర బలగాలు, ఎస్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఎక్స్ ఆర్మీతో పాటు ఇతర జిల్లాలకు చెందిన అదనపు బలగాలను ఎస్పీ అభినందించారు. అంతేకాక జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలతో పాటు జూన్ 4న జరిగిన కౌంటింగ్ ప్రక్రియ శాంతియుతంగా పూర్తి చేశామన్నారు. జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలా చర్యలు చేపట్టడం జరిగిందని, ప్రజల నుంచి కూడా చక్కని మద్దతు లభించిందని ఎస్పీ తెలిపారు.

గురువుల పాత్రే కీలకం



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడులోని అంబేడ్కర్ బాలికల విద్యాలయంలో గురువారం జరిగిన సమగ్ర శిక్ష అకడమిక్ జ్ఞానప్రకాశ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యావ్యవస్థకు పునాదులు వంటి వారని అన్నారు. సమగ్రశిక్ష ఏఎంఓ కోర్సు డైరెక్టర్ గుంట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జ్ఞానప్రకాశ్–60 రోజుల శిక్షణ కార్యక్రమా నికి జిల్లాలోని 30 మండలాల నుంచి మండలానికి ముగ్గురిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఎంఈఓలు పి.దాలినాయుడు, సీహెచ్ తిరుమలరావు, పి.ప్రభాకరరావు, పెదపాడు ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తలకు తోడుగా ఉంటాం'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలో ఎన్నికల అనంతరం భయానక వాతావరణం నెలకొందని, టీడీపీ నేతల దాడులతో రాష్ట్రంలో అత్యంత భయానక పరిస్థితులు నెలకొన్నాయని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ వర్గాలు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోతున్నాయని ఎక్కడికక్కడ దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో పార్టీ నాయకులకు కార్యకర్తలకు తోడుగా ఉండేందుకు 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి కార్యకర్తకు, అక్కచెల్లెమ్మకు, ప్రతి అన్నదమ్ముడికి, సోషల్‌మీడియా సైనికులకు ఈ కమిటీలు తోడుగా నిలుస్తాయని భరోసా నిచ్చారు. బాధిత కుటుంబాలకు పరామర్శించడమే కాకుండా వారికి అన్ని రకాలుగా న్యాయపరంగా, వైద్యపరంగా, ఆర్థికంగా సాయపడతారన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గంలో ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, నర్తు రామారావు(ఎమ్మెల్సీ), దువ్వాడ శ్రీనివాస్ (ఎమ్మెల్సీ), పేరాడ తిలక్, సీదిరి అప్పలరాజు, రెడ్డి శాంతి, పిరియా విజయలు అందుబాటులో ఉండి సాయం చేస్తారని పేర్కొన్నారు.

'దాడులు సరికాదు'



నరసన్నపేట: రాష్ట్రంలో గడిచిన రెండు రోజులుగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే లక్ష్యంగా చేసుకుని టీడీపీ దాడులకు పాల్పడుతోందని ఇది మంచి పద్ధతి కాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో కార్యకర్తలకు తాము అండగా ఉంటామని, ఎవరికి కష్టం వచ్చినా నేరుగా తనకు ఫోను చేయవచ్చని అన్నారు. జిల్లాలో కూడా టీడీపీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ జెండా మోసిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని ఇలాంటివి ఉపేక్షించబోమని కృష్ణదాస్ అన్నారు.

10న వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్‌భాగ్ పేటలోని నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈనెల 10న ఉదయం 9గంటలకు జరుగుతుందని ఆలయ ఈఓ శ్యామలరావు తెలిపారు. హుండీలను ఆలయ అధికారులు, వంశపారంపర్య ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో తెరవనున్నట్లు పేర్కొన్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో (ఐటీఐ) ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఎచ్చెర్ల ఐటీఐలో గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3816 సీట్లు ఉండగా, 2107 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 752 మంది మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారని అన్నారు. మిగిలిన 1355 మంది ఈ నెల 10వ తేదీలోగా ప్రభుత్వ ఐటీఐల్లో సర్టిఫికెట్ పరిశీలనకు హాజరు కావాలని చెప్పారు.

ప్రభుత్వ బడిలో వస్తువులు ధ్వంసం



కిటికీ అద్దాలను విరగొట్టి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

- సింగుపురం ఎంపీయూపీ పాఠశాలలో ఘటన


శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రూమ్‌ల అద్దాలు, తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పాఠశాలను ఆనుకొని ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన ఉద్యోగులు ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇప్పిలి గోవిందరావుకు గురువారం తెలియజేశారు. వెంటనే ఆయన పాఠశాలను పరిశీలించి జరిగిన సంఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పాఠశాలను నాడు–నేడులో సుందరంగా తీర్చి దిద్దారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ ఈ పాఠశాలల్లో 160 మంది విద్యార్థులు చదువుతున్నారు. తొమ్మిది మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో బడికి తాళాలు వేశారు. మంచినీటి ట్యాప్‌లు, రెండు రూమ్‌ల కిటికీ అద్దాలు, ఫ్యాన్‌లు, కంప్యూటర్ సామగ్రి, ప్లే జోన్‌కు సంబంధించిన ఉయ్యాలలు సైతం విరగ్గొట్టారు. సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులు చేతులు కడుక్కునే ట్యాప్‌లు సైతం లాక్కెళ్లిన దృశ్యం

డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఐదో సెమిస్టర్ ఫలితాలను గురువారం ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 10822 మంది పరీక్ష రాయగా, 5316 మంది పాసయ్యారని, 49.12 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. కోర్సుల వారీగా బీఏలో 1424 మందికి 933, బీబీఏలో 161 మందికి 125, బీకాంలో 1722 మందికి 846, బీఎస్సీలో 7354 మందికి 3272 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. 15 రోజుల్లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.



సాగు సమయం

వానలు కురుస్తుండడంతో రైతులు పొలం పనుల్లోకి దిగారు. పదునులు కలసి రావటంతో వారం రోజులుగా పొలం పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో విత్తనాలు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ట్రాక్టర్లు, ఎద్దులతో పొలాలను దుక్కిలు చేయటంతో పాటు గట్లు బాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మరో వైపు విత్తనాలు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

– ఎల్ఎన్ పేట



దబ్బపాడు వద్ద విత్తనాలు వేసేందుకు దుక్కి చేస్తున్న రైతులు



జంబాడ వద్ద పొలం గట్లు బాగు చేస్తున్న రైతులు

క్లుప్తంగా

చంద్రబాబును కలిసిన కలిశెట్టి



కలిశెట్టి అప్పలనాయుడును అభినందిస్తున్న చంద్రబాబు

ఎచ్చెర్ల క్యాంపస్: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు టీడీపీ అధినేత నారాచంద్ర బాబు నాయుడుని మంగళగిరిలో గురువారం కలిశారు. పార్లమెంటరీ పార్టీలో పాల్గొన్న కలిశెట్టిని ప్రత్యేకంగా అభినందించారు.

కమ్యూనిస్టు భావజాలంపై 10న సదస్సు



బొడ్డపాడులో సదస్సును విజయవంతం చేయాలని కోరుతున్న పోతనపల్లి కుసుమ, వామపక్ష నాయకులు

కాశీబుగ్గ: కమ్యూనిస్టు భావజాలంపై ఈనెల 10న పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం వద్ద సదస్సు నిర్వహిస్తున్నట్లు పీడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ అన్నారు. పలాస మండలం బొడ్డపాడులో గురువారం జరిగిన ముందస్తు సమావేశంలో పలువురు నాయకులతో కలిసి వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు కమ్యూనిస్టు పార్టీలు, విప్లవ ప్రజా సంఘాల ఐక్య కార్యచరణ వేదిక ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు తామాడ సన్యాసిరావు, నాయకులు మద్దిల రామారావు, పత్రి దానేషు, గొరకల బాలకృష్ణ, సాలిన వీరాస్వామి, కొర్రాయి నీలకంఠం, మద్దిల కైలాష్, ఢిల్లీరావు, వైకుంఠరావు, అప్పారావు, దున్న శ్రీనివాసరావు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

మందసలో దొంగలు పడ్డారు



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దొంగతనం దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలం మందస మార్కెట్‌లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మందస మార్కెట్‌లో ఉన్న దుకాణాల సముదాయాల్లో పలు దుకాణాల్లోకి దొంగలు చొరబడి దొరికింది దోచుకుపోయారు. కామేశ్వరి మందులు షాపు, పూన జయశంకర్ కిరాణాషాపుల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి మూడు గంటల మధ్యలో తాళాలు పగలగొట్టి నగదు, విలువైన మందులను దొంగలు పట్టుకుపోయారు. అదేవిధంగా శ్రీసాయిబాబా క్లాత్ స్టోర్ బట్టల దుకాణం తలుపులు విరగ్గొట్టేందుకు ప్రయత్నించినా విజయవంతం కాకపోవడంతో విడిచి పెట్టేశారు. రాత్రి పూట పోలీసులు గస్తీకాయకపోవడమే ఇలాంటి సంఘటనలకు దారి తీసిందని, పోలీసులు చర్యలు చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు. మందస మార్కెట్‌లో జరిగిన దొంగతనాలపై మందస ఎస్‌ఐ బి.అనీల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హయగ్రీవం నేత్రాలు సజీవం



నేత్రదాత కొప్పల హయగ్రీవం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని ఫాజుల్ బాగ్ పేటలో నివాసం ఉంటున్న కొప్పల హయగ్రీవం (74) అనారోగ్య కారణాలతో మృతి చెందారు. మరణాంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన భార్య అరుణ, కుమారుడు జగదీష్ శ్రీనివాస్, కుమార్తెలు పద్మిని కల్యాణిలు తమ తండ్రి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, నంది ఉమాశంకర్‌లు హయగ్రీవం కార్నియాలను సేకరించి విశాఖ లోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని కోరారు.

నా మనవరాళ్లకు దిక్కెవరు..?



రోదిస్తున్న కుటుంబసభ్యుల నడుమ చిన్నారులు

తల్లి చనిపోయిందని తెలుసు. కానీ ఆత్మహత్య చేసుకుందంటే అర్థం చేసుకునేంత వయసు ఆ పిల్లలకు లేదు. నాన్న ఉన్నాడని తెలుసు. కానీ తమను వద్దనుకుంటున్నాడని చెబితే నమ్మేంత ఆలోచన కూడా ఆ చిన్నారులకు లేదు. లోకం తెలీని వయసులో ఆ పసివాళ్లకు అమ్మ దూరమైపోయింది. నాన్న దూరం పెట్టేశాడు. ఇక తమ మనవరాళ్లకు దిక్కెవరని తాతయ్య, అమ్మమ్మ కడుసు భాస్కరరావు, రఘుపతి కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళితే..

చీడిపూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు కడుసు భాస్కరరావు, రఘుపతిల కుమార్తె యమునకు సారవకోట మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాదిలాపు యయాతితో 2017లో వివాహం జరిగింది. వీరు విశాఖపట్నం జిల్లా కొమ్మాదిలో నివాసం ఉండేవారు. యయాతి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే భార్యాభర్తల మధ్య కొన్నేళ్లుగా మనస్పర్థలు ఉన్నాయి. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక ఈ నెల 3న యమున ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై యయాతి యమున తల్లిదండ్రులకు సమాచారం అందించి పోస్టుమార్టం అయిన తర్వాత కుమార్తె మృతదేహంతో పాటు ఇద్దరు కుమార్తెలను బుధవారం రాత్రి చీడిపూడిలో విడిచిపెట్టి వెళ్లిపోయాడు. కనీసం దహన సంస్కారాలకు కూడా హాజరు కాలేదని వృద్ధులు కన్నీరుమున్నీరయ్యారు. తమ మనవరాళ్లకు దిక్కెవరని గుండెలవిసేలా రోదించారు.

– సారవకోట

వేలి కొసన సమస్త సమాచారం

- అన్నదాతలకు సాంకేతిక సాయం
- మొబైల్ యాప్‌లలో తెలుగులో సమాచారం
- శాస్త్రవేత్తలతో నేరుగా సంప్రదించే అవకాశం
- సాగులో అండగా రైతు సేవా యాప్‌లు



టెక్కలి:

స్మార్ట్‌ఫోన్లు సాధారణమైపోయిన కాలంలో రైతుకు సాగులో సలహాలు పొందడం సులువైంది. అన్నదాతలకు అండగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఫోన్లలో వ్యవసాయానికి అండగా వివిధ రకాల యాప్‌లు తెలుగులోనే సాంకేతిక సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ యాప్‌ల ద్వారా వ్యవసాయానికి అవసరమైన ప్రతి సందేహాన్ని నివృత్తి చేసుకోవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బెడద, చీడ పీడలు, దళారుల మోసాలు ఇలాంటి వాటిని అధిగమించి రైతులంతా మరింత ఆసక్తిగా వ్యవసాయాన్ని చేసేందుకు ఈ రైతు సేవా యాప్‌లు ఉపయోగపడతాయి.

కృషి జ్ఞాన్ (వ్యవసాయ జ్ఞానం)



ఈ యాప్‌తో రైతులు నేరుగా నిపుణులను సంప్రదించవచ్చు. వ్యవసాయంలో రైతులు అడిగిన ప్రశ్నలకు నోటిఫికేషన్ రూపంలో రైతుల మొబైల్‌కే సలహాలు వస్తాయి. ఒక రైతు ఇంకొక రైతుకు సమాచారాన్ని పంపించుకునే అవకాశం ఉంది. వ్యవసాయానికి సంబంధించి ఫొటోలు, వీడియోలు షేర్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. ఈ యాప్‌లో కొన్ని రకాల యానిమేటిక్ వీడియోలతో రైతులకు సులభంగా అర్థమవుతుంది.

వ్యవసాయం

వివిధ రకాల పంటల్లో ఏం సాగు చేయాలి.. నీటి యాజమాన్యం.. ఎరువులు.. విత్తనాలు.. పురుగు మందుల వాడకం తదితర వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. ప్రధానంగా వరి సాగు పద్ధతులు, భూసార పరీక్షలు, అంతర పంటలు, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అర్థమయ్యే విధంగా సమాచారం అందుబాటులో ఉంటుంది. 18 రకాల వ్యవసాయ సంబంధిత సేవలను ఈ యాప్ ద్వారా రైతులు ఉపయోగించుకోవచ్చు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారంతో పాటు భూమి వివరాలు, విత్తనాలు, పరికరాలు, మార్కెట్, చీడ పీడలు, యంత్రాల అమ్మకాలు, కొనుగోలు, అద్దెకు ఇవ్వడం, వాతావరణం, నీటి లభ్యత, సేంద్రీయ ఎరువులు, నర్సరీలు, పండ్లు, కూరగాయలు, మత్స్య సంపద, పశు సంపదకు సంబంధించిన సమాచారం ఈ యాప్‌లో అందుబాటులో ఉంటుంది.



వివిధ రకాల వ్యవసాయం యాప్‌లో రైతులకు అవసరమైన సమాచారం వివరాలు

కృషి విజ్ఞాన్



వ్యవసాయంలో కొత్త పద్ధతులకు సంబంధించిన సమాచారాన్ని ఈ యాప్‌లో పొందు పరిచారు. తెలుగులో అన్ని రకాల పంటల చిత్రాలతో పాటు పోషకాల లోపం, పురుగులు, తెగుళ్ల సమస్యలను గుర్తించి సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. దీనిలో ఫార్మా క్యాలిక్యులేటర్, కాల్‌సెంటర్, వీడియోలు, అడ్రస్ బుక్ ఉంటాయి. పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని వారి చిరునామాలు, ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయి. చిరునామాలో కాల్‌బటన్‌పై క్లిక్‌చేస్తే నేరుగా కాల్ వెళ్లే విధంగా రైతులకోసం ఈ యాప్‌ను రూపొందించారు.

అన్నదాత

ఈ యాప్‌లో వివిధ కేటగిరీల్లో వ్యవసాయానికి సంబంధించిన సమాచారం లభిస్తుంది. ప్రధానంగా వ్యవసాయ పరికరాలు, ఆహార ధాన్యాలు, నూనెగింజలు, పప్పు ధాన్యాలు, వాణిజ్య పంటలు, కూరగాయలు, పండ్లు గురించి వివరాలు పొందుపరిచారు. పాడి పశువుల పెంపకానికి సంబంధించిన వివరాలను సైతం అందుబాటులో ఉంచారు.

నా పంట



నా పంట యాప్‌లో పంటల సంరక్షణ విధానాలు, పంటల బీమా సమాచారం, చీడ పీడలు, కలుపు మొక్కల సమాచారాన్ని సమగ్రంగా పొందు పరిచారు. వివిధ రకాల పురుగులు, తెగుళ్ల వాటి నివారణ పద్ధతులు, పురుగు మందులు పిచికారీ చేసే విధానం, తక్కువ ధరలకు లభించే నాణ్యమైన పురుగు మందుల వివరాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు పంటలను కాపాడుకోవడానికి, రోజు వారీ లెక్కలు వేసుకోవడంతో పాటు సేంద్రీయ సాగు విధానాలు, వివిధ రకాల పంటలకు హాని కలిగించే పురుగులు, పంటలకు మేలు చేసే కీటకాలు, అంతర పంటల సమాచారం అందుబాటులో ఉంటుంది. మార్కెట్ ధర వివరాలు, ముందస్తు వాతావరణ సమాచారం, కోల్డ్ స్టోరేజీల సమాచారం సైతం యాప్‌లో పొందు పరిచారు. వ్యవసాయంపై ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ యాప్ ఎంతగానో ఉపయోగ పడుతుంది.

వ్యవసాయ యంత్రాలు



వ్యవసాయ యంత్రాలు యాప్ ద్వారా వ్యవసాయానికి అవసరమైన సరికొత్త ఆధునిక యంత్రాల వివరాలను తెలుసుకోవచ్చు. ఏయే యంత్రాలు ఎలా పనిచేస్తాయి..? రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయి..? ఎక్కడ ఎంత ధరకు అందుబాటులో ఉన్నాయి అనే వివరాలు ఈ యాప్‌లో పొందు పరిచారు. మారుతున్న సాంకేతిక పద్ధతులకు అనుగుణంగా వ్యవసాయ యంత్రాల వివరాలు ఈ యాప్‌లో పొందు పరిచారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవలా పురపు తవుడు గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ ఢీకొట్టటంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో టెక్కలి ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని మామిడిగుడ్డి గ్రామంలో గురువారం టెక్కలి ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 700 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీని అరికట్టడమే ధ్యేయంగా దాడులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో టెక్కలి ఎస్‌ఈబీ సీఐ రాజశేఖర నాయుడు, సిబ్బంది ఉన్నారు.

టూరిస్ట్ బస్సులకు తప్పిన ప్రమాదం



అపార్ట్‌మెంట్‌లో సేద తీరుతున్న మధ్యప్రదేశ్ వాసులు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం హైవేను ఆనుకొని శ్రీసాయి డెంటల్ కళాశాల సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో (హైటెక్ ప్యారడైజ్) మధ్య ప్రదేశ్ వాసులు ఓ వంద మంది వరకు కనిపించడం స్థానికులను ఆశ్చర్యపరిచింది. ఇంతమంది ఎందుకున్నారని ఆరా తీస్తే.. ప్రమాదం విషయం బయటపడింది. మధ్యప్రదేశ్ నుంచి తిరుపతి వెళ్లడానికి నాగాలాండ్ రిజిస్ట్రేషన్ నంబరు గల రెండు బస్సుల్లో వందమంది వరకు యాత్రికులు రెండు రోజుల కిందట బయల్దేరారు. శ్రీకాకుళం చేరుకునేసరికి గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఓ బస్సులోని ముందుభాగం టైరు పేలడంతో పాటు రెండో బస్సు తాలుకా బేరింగ్‌లు ఊడిపోవడంతో వాహనాలు కుదుపునకు గురయ్యాయి. డ్రైవర్లు చాకచక్యంగా పక్కకి తీసి ఆపారు. అయితే వాహనాల మరమ్మతులు ఓ పట్టాన పూర్తి కాకపోవడంతో యాత్రికుల్లో వృద్ధులు, మహిళలు, పిల్లలు ఎక్కువ శాతం ఉండటంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో గుంపులుగా వెళ్లి మనిషోచోట సేదతీరారు. మధ్యాహ్నం మూడు గంటలకు బస్సులు సిద్ధమవ్వడంతో తిరుగుపయనమయ్యారు.

భార్య గర్భిణి.. మణిపూర్‌లో భర్త మృతి



తేజేశ్వరరావు (ఫైల్)



ప్రమాద స్థలం

టెక్కలి రూరల్: మణిపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ మెట్ట తేజేశ్వరరావు (38)అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, తోటి స్నేహితులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఇటీవల మణిపూర్‌లో జరిగిన ఎన్నికల విధుల్లో పాల్గొన్న తేజేశ్వరరావు తన ఎన్నికల విధులు ముగించుకుని తిరిగి గురువారం ఉదయం తన స్నేహితులతో కలిసి తిరిగి వెళ్తుండగా వారు వెళ్తున్న వాహనం మరమ్మతులకు గురవ్వడంతో దాన్ని రోడ్డు పక్కగా ఆపేసి అధికారులకు సమాచారం ఇస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో పలువురికి తీవ్రగాయాలకు కాగా అందులో ఉన్న టెక్కలి మండాపాలంగా కాలనీకి చెందిన మెట్ట తేజేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో అక్కడి అధికారులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య శ్రావణి 5నెలల గర్భిణి. వారిని నాలుగేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. మృతుడి తండ్రి రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి. తేజేశ్వరరావు మృతి చెందిన విషయం తెలియడంతో టెక్కలిలో విషాద ఛాయలు అలముకున్నాయి.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



విత్తనాల నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారి

నరసన్నపేట: ఎరువుల షాపుల్లో విత్తనాల డీలర్లు అధీకృత కంపెనీల ద్వారా సరఫరా అయిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. స్థానిక నాగార్జున రైతు డిపోలో వరి విత్తనాల గిడ్డంగిని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులో ఉన్న విత్తనాల రకాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విత్తనాలు కొన్న రైతులు విధిగా రశీదు తీసుకోవాలన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే రైతులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. అలాగే విత్తనాలు పొలంలో వేసే ముందు మొలక వేసి మొలక శాతం కట్టుకోవాలని సూచించారు. అలాగే రశీదు, విత్తనాల ప్యాకెట్ భద్రపరచాలని కోరారు.

దాబాలో గొడవ.. ఒకరు మృతి



మృతి చెందిన రాంబాబు

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామంలో జాతీయ రహదారి వద్ద గల సంగీత దాబాలో బుధవారం అర్ధరాత్రి దాటాక సిబ్బంది మధ్య జరిగిన గొడవలో మాడుగల రాంబాబు (54) మృతి చెందాడు. దాబా సిబ్బంది, బారువ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాబాలో కొర్లాం గ్రామానికి చెందిన సూర్యనారాయణ మహంతి, పాలాకి మండలం చెల్లయ్య వలస గ్రామానికి చెందిన మాడుగల రాంబాబు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ తరచూ గొడవపడుతుండేవారు. బుధవారం అర్ధరాత్రి పడుకునే సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో సూర్యనారాయణ మహంతి రాంబాబుపై దాడి చేయడంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. రాంబాబు భార్యను విడిచి పెట్టి ఒంటరిగా జీవిస్తున్నట్లు చెల్లయ్య వలస గ్రామస్తులు తెలిపారు. దాబా యజమాని ఎం.గణపతి ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. సూర్యనారాయణ మహంతిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు.

పెళ్లయిన ఆరు నెలలకే..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఆదినారాయణ (ఫైల్)

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం గ్రామానికి చెందిన బి.ఆదినారాయణ (29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 4న మంగళవారం రాత్రి రణస్థలం నుంచి కమ్మసిగడాంలోని తన ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా కమ్మసిగడాం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆదినారాయణకు తీవ్ర గాయాలు కావడంతో 108పై శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ మార్గం మధ్యలోనే ఆయన మృతి చెందారు. మృతునికి పెళ్లయ్యి ఆరు నెలలే అవుతోంది. భార్య గుణమాధురి ప్రస్తుతం గర్భిణి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు.

అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతం

- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖల సహాయ, సహకారాలు, భాగస్వామ్యం మరువలేనివని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. విజయవంతంగా కౌంటింగ్ నిర్వహణకు సూచనలు, సలహాలు అందజేసిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే జిల్లాలో గెలుపొందిన పార్లమెంట్ అభ్యర్థి, 8 నియోజకవర్గాల శాసన సభ్యులకు అభినందనలు తెలియజేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా ఆర్వోలు, నోడల్ అధికారులతో గురువారం సమావేశమై ప్రతి ఒక్కరిని పేరుపేరునా అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించడం చాలా సంతోషకరమని, జీవిత కాలం ఈ జ్ఞాపకాలు మరువలేనన్నారు.

సుమారు 6 నెలల నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారన్నారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్ కూడా బ్రీఫింగ్ నిర్వహించామని, కౌంటింగ్ ప్రెస్ సజావుగా జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విజయం ప్రతి ఒక్కరిదని అన్నారు. బీఎల్‌ఓ, మండలం, డివిజన్, జిల్లా స్థాయి అందరు అధికారుల, పోలీస్ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు.

కౌంటింగ్ విజయవంతం చేయడంలో, హింసాత్మక ఘటనలు జరగకుండా అడ్డుకట్ట వేయడంలో ఎస్పీ కీలక బాధ్యతలు పోషించారన్నారు. సబ్ కలెక్టర్, ఆర్‌ఓలు చేసిన కృషి, గత నాలుగు నెలలుగా నోడల్ అధికారులు అంకితభావం చేపట్టిన విధులు ఇవన్నీ పోలింగ్, కౌంటింగ్ పూర్తి విజయవంతం చేయడానికి సహకరించాయని పేర్కొన్నారు. ఎన్నికలు మంచి ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్‌లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సమన్వయంతో పనిచేసి విజయానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చారన్నారు. శిక్షణ తరగతుల్లో అందరు సమన్వయం పాటించారన్నారు. నిర్దేశించిన పనులు ప్రతి ఒక్కరూ చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ కౌంటింగ్ నిర్వహణలో వారి వారి అనుభవాలను పంచుకున్నారు. కొన్ని సందర్భాల్లో కష్టమైనా తాజా ఫలితం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. భోజనం వేడిగా, రుచిగా తిన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉన్న కలెక్టర్ వ్యవహరించిన విధానాన్ని, సున్నితమైన అంశాలపై కూడా ఆయన స్పందించిన తీరుపై పలువురు నోడల్ అధికారులు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. విజయంలో తమను భాగస్వాములు చేసిన జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్‌కు వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఆముదలవలస నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్, టెక్కలి రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుదర్శన్ దొర, డాక్టర్ భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ట్రైనర్ శేషగిరికి అభినందన

ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందించి, జిల్లాలో ఎన్నికలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్, ఉపాధ్యాయుడైన కె.శేషగిరిరావును కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అభినందించారు. జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు సంతకాలతో కూడిన అభినందన ప్రశంసా పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన అందజేశారు.